మోదీ కిట్ల కోసం సిగపట్లు

ముషీరాబాద్‌లో మోదీ కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

- ముషీరాబాద్‌లో మోదీ కిట్ల పంపిణీలో గందరగోళం
- ఉన్నవి 350 కిట్లు.. వచ్చింది వెయ్యిమందికి పైనే..
- ఐపోతున్నాయనే ప్రచారంతో.. పసి పిల్లలను వదిలేసి.. కిట్ల కోసం ఎగబడిన తల్లులు
- మహిళల తోపులాట, ఘర్షణతో చేతులెత్తేసిన బీజేపీ నేతలు
- తప్పిపోయిన చిన్నారులను అక్కున చేర్చుకున్న పోలీసులు
- నేతలను నిలదీసి., శాపనార్థాలు పెట్టి వెనుతిరిగిన మహిళలు

కవాడిగూడ, మార్చి 13 : ముషీరాబాద్‌లోని కశిష్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రధాని మోదీ పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమంలో బుధవారం తోపులాట, తొక్కిసలాట, ఘర్షణ చోటుచేసుకున్నది. తల్లీ బిడ్డల సంపూర్ణ ఆరోగ్యం కోసం ముషీరాబాద్‌లో బీజేపీ నాయకులు నిర్వహించిన మోదీ కిట్ల పంపిణీలో తల్లీ పిల్లలతో వందలాది మంది రావడంతో హాల్ అంతా కిక్కిరిసిపోయింది. కిట్ల కోసం జనం ఎగబడడంతో హాల్‌లో చిన్నారులు, తల్లులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ముందుగా ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి ఎం.రమేశ్ రామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ హాజరై మోదీ పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తుండగా కిట్లు తమకు ముందుగా ఇవ్వాలని కూర్చున్నవారంతా ఒక్కసారిగా లేచి ఎగబడడంతో హాల్‌లో గందరగోళ పరిస్థితి నెలకొంది. మోదీ కిట్లు 350 నుంచి 400 వరకు ఉండగా అంతకు రెండింతల మంది రావడంతో కిట్లు సరిపోవనే బావనతో మహిళలు మీదపడి లాక్కెళ్లారు. ఈ క్రమంలో డాక్టర్ లక్ష్మణ్ అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో తిరిగి మహిళలను సర్దిచెప్పి కిట్లను పంపిణీ చేస్తుండగా ఒక్కరొక్కరూ మూడు నుంచి నాలుగు కిట్లను లాక్కెళ్లారు. కిట్లు అందని మహిళలు బీజేపీ నాయకులను నిలదీశారు. పార్టీకి చెందిన కొందరు నాయకులు తమ తమ అనుయాయులకు మూడు నాలుగు కిట్లను అందజేయడంతో బీజేపీ నాయకులతో మహిళలు వాగ్వాదానికి దిగారు. ఉదయం 8 గంటల నుంచి తాము హాల్ వద్ద పడిగాపులు కాచామని, తమకు కిట్లు అందకపోవడం బాధాకరమని మహిళలు ఆరోపించారు. కిట్ల కోసం హాల్ వద్దనే వందలాది మంది వేచిచూస్తుండడంతో పోలీసులు బయటకు వెళ్లగొట్టారు. దీంతో మోదీ కిట్ల కోసం హాల్‌కు వచ్చిన పసి పిల్లల తల్లులు, మహిళలు బీజేపీ నాయకులను శాపనార్థాలు పెడుతూ వెళ్లిపోవడం గమనార్హం..

పిల్లలను వదిలిపెట్టి కిట్ల కోసం పాకులాట

తమ పిల్లలను వదిలిపెట్టి మోదీ కిట్ల కోసం మహిళలు ఎగబడడంతో ఉద్రిక్త వాతావరణ నెలకొంది. చిన్నారులు తప్పిపోవడంతో అక్కడ ఉన్న పోలీసులు ఆ చిన్నారులను అక్కున చేర్చుకొని భుజాన ఎత్తుకొని ఈ చిన్నారులు ఎవరి బిడ్డలు, మోదీ కిట్లు కావాలా.. మీ పసిపిల్లలు మీకు వద్దా.. అంటూ మహిళల మధ్యన నిలబడి చెప్పడంతో ఆ చిన్నారుల తల్లులు వచ్చి మా పిల్లలు అంటూ దగ్గరకు వచ్చారు. దీంతో పోలీసులు మహిళలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చిన్నారులను ఆ తల్లులకు అప్పగించారు.

తప్పిపోయిన చిన్నారులను చూపుతున్న కానిస్టేబుల్

ఐసీఏఐ ఆధ్వర్యంలో సీఏ బోధన

500 విద్యాసంస్థలతో ఒప్పందం

జూబ్లీహిల్స్, మార్చి 13 : చార్టడ్ అకౌంటెంట్ కోర్సులకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని దేశవ్యాప్తంగా 500కు పైగా విద్యాసంస్థల్లో సీఏ కోర్సుల బోధనకు సహకారం అందించనున్నట్లు ఐసీఏఐ నూతన అధ్యక్షుడు రంజిత్ కుమార్ అగర్వాల్ తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం ఆయా విద్యా సంస్థల్లో స్థానిక అధ్యాపకుల నియామకం చేసి వారికి అవసరమైన మద్దతు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కాగా ఆర్థిక వ్యవస్థలో ప్రతి ట్రిలియన్ డాలర్ల వృద్ధికి లక్ష మంది చార్టడ్ అకౌంటెంట్లు అవసరమని.. స్వాతంత్రం వచ్చి 100 ఏండ్లు పూర్తయ్యే సరికి దేశానికి 30 లక్షల మంది సీఏలు అవసరం ఉంటుందన్న అంచనాల ప్రకారం పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను సీఏ పట్ల ఆకర్షితులయ్యేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అగర్వాల్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఐసీఏఐ కింద 4 లక్షల మంది సీఏ సభ్యులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని.. గతేడాది 22 వేల మంది సీఏ అర్హతపొందారని తెలిపారు. 2023లో అర్హత పొందిన వారిలో 138 కంపెనీలు 9 వేల మందిని క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లలో నియమించుకున్నారని.. ఇందులో ఒక విద్యార్థికి రూ.24 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చినట్లు తెలిపారు. విద్యార్థులందరికీ గతేడాది ప్యాకేజీ సగటున రూ.12 లక్షలుగా ఉండగా విదేశాలలో ఇది రూ.41 లక్షలుగా ఉందన్నారు. ఈ రంగంలో విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు ఐసీఏఐ పలు రాష్ట్రాల్లో ప్రత్యేక రాయితీలు కూడా ఇస్తున్నట్లు మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థ అడ్మిన్ అడ్వైజర్, సీఏ మట్టుపల్లి మోహన్ తెలిపారు.

శ్యామలానంద ప్రసాద్‌కు రాయప్రోలు సాహితీ పురస్కారం

ముషీరాబాద్, మార్చి 13 : వంశీ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి కళా సుబ్బారావు కళా వేదికలో ఆచార్య రాయప్రోలు సుబ్బారావు జయంతి సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరావు ముఖ్య అతిథిగా పాల్గొని అవధాని, కళారత్న డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్‌కు రాయప్రోలు-వంశీ జాతీయ సాహితీ జీవన సాఫల్య పురస్కారాన్ని అందచేశారు. సాహితీవేత్త వోలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మనోరమ, అపర్ణ, మహాలక్ష్మి, సుమ, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, తేన్నేటి సుధాదేవి, సుంకరపల్లి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌కి టీసీపీ వేవ్ సంస్థ విరాళం

మణికొండ, మార్చి 13 : అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పిస్తూ వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతున్న నగరంలోని ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్ స్వచ్ఛంద సంస్థకు టీసీపీ వేవ్ సాఫ్ట్‌వేర్ సంస్థ సీఎస్ఆర్ కార్యకలాపాల్లో భాగంగా బుధవారం రూ.లక్ష నగదును విరాళంగా అందజేశారు. టీసీపీ వేవ్ సంస్థ సీఎస్ఆర్ విభాగం అధిపతి స్వప్న వాయువేగుల, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ టి.కోట్రేష్ తదితరులు ఉన్నారు.



ఆండాళమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, చిత్రంలో రాజ్యసభ సభ్యులు దామోదర్‌రావు

దీవకొండ ఆండాళమ్మకు ఘన నివాళి

బంజారాహిల్స్, మార్చి 13 : రాజ్యసభ సభ్యులు, నమస్తే తెలంగాణ సీఎండీ దీవకొండ దామోదర్ రావు మాతృమూర్తి దీవకొండ ఆండాళమ్మ ద్వాదశ దినకర్మ సందర్భంగా బుధవారం జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో పలువురు ప్రముఖులు ఘన నివాళులర్పించారు. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, ఎంపీలు రంజిత్ రెడ్డి, పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, సురేశ్ రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ మంత్రి బస్వరాజ్ సారయ్య, కాంగ్రెస్ నేత కేవీపీ.రామచందర్‌రావు, చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆరూరి రమేశ్, ఎల్ల కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సీఎల్.రాజం, మైహోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు, జెన్‌కో, ట్రాన్స్‌కో మాజీ సీఎండీ ప్రభాకర్‌రావు, నమస్తే తెలంగాణ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి, తెలంగాణ టుడే ఎడిటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డి.చిరంజీవి, నెట్‌వర్క్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రావు, చీఫ్ ఆఫ్ న్యూస్ బ్యూరో ఓరుగంటి సతీష్, సీజీఎం ఆపరేషన్స్ సీహెచ్ శ్రీనివాస్, డీజీఎం సర్క్యులేషన్ రాంరెడ్డి, టీ న్యూస్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ సురేష్ తదితరులు నివాళులర్పించారు. రాజ్యసభ సభ్యులు దామోదర్‌రావుతో పాటు ఇతర కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఎమ్మెల్సీ కవితకు జన్మదిన

శుభాకాంక్షలు

భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు జన్మదినం శుభాకాంక్షలు తెలిపిన భారత జాగృతి రాష్ట్ర నాయకుడు బొల్లంపల్లి సందీప్ కుమార్

- వనస్థలిపురం, మార్చి 13 :

అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్

సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : అగ్ని ప్రమాద సమయంలో చిన్నారులకు అవగాహన కల్పిస్తే వారి జీవితకాలం భద్రత నైపుణ్యాలు అలవర్చుకుంటారని ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి తెలిపారు. అగ్ని ప్రమాదాల సమయంలో ఇతరులపై ఆధారపడకుండా తమ ప్రాణాలను కాపాడుకోవచ్చని చెప్పారు. ప్రధానంగా రాబోయే వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ప్రకాశ్ రెడ్డి సూచించారు. ఈవీడీఎం ఆధ్వర్యంలో 24 ప్రాంతాలలో మాక్ డ్రిల్ నిర్వహించారు. 9 పబ్లిక్ ప్రాంతాలు, 10 షాపింగ్ మాల్స్/ షోరూంలు, ఐదు పాఠశాలలు/ కాలేజీలలో వారం రోజులుగా మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. లంగర్‌హౌస్ ప్రీమియర్ హాస్పిటల్, సరూర్‌నగర్ ఫ్యాషన్ ఫాక్టరీ, చాంద్రాయణగుట్ట బజాజ్ ఎలక్ట్రానిక్స్, కేపీ హెచ్‌బీ ఫ్యాషన్ ఫ్యాక్టరీ, లోయర్ ట్యాంక్ బండ్ మ్యారియట్ హోటల్ వద్ద మాక్ డ్రిల్ చేపట్టి అగ్ని ప్రమాద నివారణపై అవగాహన చేపట్టారు. వాణిజ్య భవనాలు, ఆసుపత్రులు, పాఠశాలల్లో మాక్ డ్రిల్ అవసరం అనుకుంటే 040-2955 5500, మొబైల్ నంబరు 9000113667లకు ఫోన్ చేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడమే లక్ష్యంగా , రెసిడెన్షియల్ ఏరియాలో ప్రమాదకర రసాయన నిల్వలు ఉన్నట్లయితే 040-2955 5500, 9000113667 నంబర్‌కు వాట్సాప్ చేయాలన్నారు.

చీర్యాల్‌లో అక్రమ నిర్మాణాల తొలగింపు

చీర్యాల్‌లో ఇండ్లను జేసీబీతో కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

కీసర, మార్చి 13 : కీసర మండలం చీర్యాల్ గ్రామం పరిధిలోని సర్వే నంబర్ 101, 102, 221, 222, 311, 325, 328, 329, 334, 335, 337లలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో వెలిసిన అక్రమనిర్మాణాలపై రెవెన్యూ అధికారుల కొరడా ఝుళిపించారు. వివరాల్లోకి వెళితే.. చీర్యాల్‌లోని పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో కొందరు బిల్డర్లు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టారు. స్థానికుల ద్వారా ఫిర్యాదులు అందుకున్న కలెక్టర్ వెంటనే నిర్మాణాలను కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రంగంలోకి దిగిన ఇరిగేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూశాఖల అధికారులు పోలీసుబందోబస్తు మధ్య సుమారు 40 ఇండ్లను కూల్చివేశారు. ఈ సందర్భంగా మండల డీఎల్‌పీఓ సాంబిరెడ్డి మాట్లాడుతూ చీర్యాల్‌లోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమంగా ప్రభుత్వ అనుమతి లేకుండా పెద్ద మొత్తంలో నిర్మాణాలకు చేపట్టారని, కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర మండల తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీవో వినూత్న, పంచాయతీ కార్యదర్శి నారాయణగౌడ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బెస్త వెంకటేశ్, కీసర ఎంపీపీ మల్లారపు ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష ఉన్నతికి గ్రంథాలయాల కృషి గొప్పది

ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

తెలుగు యూనివర్సిటీ, మార్చి 13 : భాషా సాహిత్యాలకు సేవలు అందిస్తున్న ప్రముఖులను సత్కరించడం ముదావాహమని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో బహుముఖ ప్రజ్ఞాశాలి, హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు 121వ జయంతి, భాషా నిలయం వ్యవస్థాపక కార్యదర్శి రావి చెట్టు రంగారావు 147వ జయంతిని బుధవారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని భాషా నిలయం ప్రాంగణం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బూర్గుల రామకృష్ణారావు ప్రతిభా పురస్కారాన్ని ఓయూ పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ వి.కిషన్‌రావు, రావి చెట్టు రంగారావు తెలుగు భాషా వికాస పురస్కారాన్ని సుప్రసిద్ధ రచయిత అంపశయ్య నవీన్‌కు ప్రదానం చేసి సత్కరించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో శాసన మండలి సభ్యులు సురభి వాణీదేవి ప్రసంగించారు. కార్యక్రమంలో కాళోజీ అవార్డు గ్రహీతల డాక్టర్ వేణుగోపాల్, సాహితీవేత్తలు డాక్టర్ వెలుదండ నిత్యానందరావు, భాషా నిలయం ఉపాధ్యక్షులు కె.చంద్రప్రకాశ్‌రావు, గౌరవ కార్యదర్శి టి.ఉడయవర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రుణాలను అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

పీఎం సూరజ్ పోర్టల్ ప్రారంభం

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 13 : ప్రధాన మంత్రి మోదీ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అందజేస్తున్న రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం దేశవ్యాప్తంగా ప్రధాన మంత్రి చేతుల మీదుగా సామాజిక అభ్యున్నతి మరియు ఆధారిత ప్రజాసంక్షేమం (పీఎం సూరజ్ పోర్టల్)ను అన్‌లైన్‌లో ప్రారంభించారు. కలెక్టర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు లక్ష రూపాయల రుణాలను అందజేశారు. అనంతరం సఫాయి కార్మికులకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులను అందజేశారు. ఈ కార్డుల ద్వారా రూ.5 లక్షల వరకు అరోగ్య బీమా కార్మికులకు వర్తిస్తుందని తెలిపారు. లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు, కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సంజయ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజీ, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సెంటెనరీ పైలాన్.. రానున్న తరాలకు ఆదర్శం

- ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

సెంటెనరీ పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి, ఓయూ అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 13 : ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సెంటెనరీ పైలాన్‌ను పట్టభద్రుల ఎమ్మెల్సీ సురభి వాణీదేవి బుధవారం ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల పక్కనే నిర్మించిన ఈ పైలాన్‌ను రూ.1.5 కోట్ల వ్యయంతో రూపొందించారు. దీనికి జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలకు చెందిన రాజేందర్ నాగుల ఆర్కిటెక్ట్‌గా, కేఎస్ రఘు చక్రవర్తి శిల్పిగా పైలాన్‌ను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా వాణీదేవి మాట్లాడుతూ పైలాన్‌ను ఆవిష్కరించడం తన జీవితంలో మరిచిపోలేని అనుభూతి అని అన్నారు. ఓయూ ప్రారంభించి 75 ఏళ్లు గడుస్తున్న సందర్భంగా నిర్వహించిన ప్లాటినం జూబ్లీ పైలాన్‌ను తన తండ్రి, అప్పటి పీవీ నరసింహారావు ప్రారంభించడం, శతాబ్ది ఉత్సవాల పైలాన్‌ను తాను ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఓయూ, ఆర్ట్స్ కళాశాల భవనం విద్యార్థులు, అధ్యాపకులకు మాత్రమే కాకుండా ఎంతో మందికి ఉత్తేజం, ప్రేరణను అందిస్తోందని పేర్కొన్నారు. పర్యాటకులకు సైతం ఓయూ ఔన్నత్యం తెలిపేలా పైలాన్, ఎత్తైన జాతీయ జెండా ఏర్పాటు చేయడం సముచిత నిర్ణయమన్నారు. ఓయూ అందించిన వందేళ్ల విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, పోరాట వారసత్వానికి చిహ్నంగా పైలాన్ నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. రానున్న తరాలకు ఇది ఆదర్శంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెను ప్రమాదం

జూబ్లీహిల్స్, మార్చి 12 : ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెను ప్రమాదం పొంచి ఉన్నదని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ డాక్టర్ ఎం.ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఎగుమతులు, అనుబంధ వ్యాపారాలపై ఆధారపడిన వారు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం యూసుఫ్‌గూడలోని నిమ్స్‌మేలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సౌజన్యంతో 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అండ్ ఆల్టర్నేటివ్ మెటీరియల్స్' అన్న అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని ప్లాస్టిక్ వల్ల భవిష్యత్ తరాలు ఎదుర్కొనే ప్రమాదాలు.. నేటితరం అనుభవించే అనర్థాలను వివరించారు. ఈ వర్క్‌షాప్‌ను ఆలిండియా ప్లాస్టిక్స్ మ్యానుఫ్యాక్చర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వెన్నం అనిల్ రెడ్డి ప్రారంభించారు. వర్క్ షాప్ డైరెక్టర్ జె.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో తెలంగాణ, ఏపీ ప్లాస్టిక్ తయారీదారుల సంఘం అధ్యక్షుడు అనంతుల దయాకర్, పీసీబీ, నిమ్స్‌మే ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతకు వ్యవస్థాపకతపై అవగాహన

బుధవారం జరిగిన సదస్సులో మాట్లాడుతున్న చౌదరి

మలక్‌పేట, మార్చి 13 : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దేశ సామాజిక, ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఉపాధి అవకాశాలను సృష్టించడంతోపాటు దేశంలోని మారుమూల ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతున్నాయని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల హైదరాబాద్ డీఎఫ్ఓ, జీఆర్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ.చౌదరి సూచించారు. గిరిజన యువత కోసం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లోని అవంతి డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం 'యువతకు వ్యవస్థాపకతపై అవగాహన సదస్సు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ జీఎం సునీత్ జా, అవంతి విద్యాసంస్థల హెచ్ఆర్ డైరెక్టర్ జయప్రద, డైరెక్టర్ సాయిరాం, ఏఓ మోహన్‌రావు, మాలతీ ఎంటర్ ప్రైజెస్ నిర్వాహకురాలు బి.హరిత, 120మంది గిరిజన విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీసీఎంబీ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం

సిటీబ్యూరో, మార్చి 13(నమస్తే తెలంగాణ) :ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు లైఫ్ సైన్సెస్ సేవలు అందించడమే లక్ష్యంగా థర్మోఫిషర్ సెంటర్‌ను ప్రారంభించారు. సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలార్ బయోలజీలోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న స్టార్టప్‌లకు వీలుగా ఈ సెంటర్ ఏర్పాటు చేశారు. సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ నందికూరి, ఏఐసీ సీఈవో మధుసూదన్ రావు, థర్మోఫిషర్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 13 : దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ ఒకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, బెడ్‌సైడ్ అసిస్టెంట్ తదితర కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సును అందించనున్నట్లు పేర్కొన్నారు. డయాలసిస్ అసిస్టెంట్ కోర్సుకు కనీస అర్హత ఇంటర్మీడియట్, బెడ్‌సైడ్ అసిస్టెంట్ కోర్సు కనీస అర్హత ఎనిమిదో తరగతి కాగా, మిగిలిన కోర్సులకు కనీస అర్హత పదవ తరగతి అని వివరించారు. ఈ నెల 19వ తేదీలోపు కోర్సుల్లో చేరాలని పేర్కొన్నారు. అనస్థీషియా టెక్నీషియన్, రెస్పిరేటరీ థెరపీ, ఈసీజీ టెక్నీషియన్, పర్‌ఫ్యూజన్ టెక్నీషియన్, క్యాథ్‌ల్యాబ్ టెక్నీషియన్ తదితర విభాగాల్లో డిప్లొమా కోర్సులను అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు 8309037134, 6305895867 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మార్చి 2వ గురువారం వరల్డ్ కిడ్నీ డే

సిటీబ్యూరో, మార్చి 13(నమస్తే తెలంగాణ): రోజురోజుకు పెరుగుతున్న మూత్రపిండ సంబంధిత వ్యాధుల నుంచి వాటిని సంరక్షించడం, కిడ్నీ ఆరోగ్యసంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే విన్-ఇండియా ముఖ్య ఉద్దేశమని వైద్య నిపుణులు తెలిపారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎక్స్-వేదికగా నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పలువురు వైద్యనిపుణులు కిడ్నీ ఆరోగ్య సంరక్షణ, నూతన చికిత్సా పద్ధతులు, వ్యాధి నిర్ధారణ పద్ధతులు తదితర అంశాలపై చర్చించారు. ప్రతి సంవత్సరం మార్చి 2వ గురువారం వరల్డ్ కిడ్నీ డేగా పరిగణించడం జరుగుతుందని వక్తలు తెలిపారు. ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజి, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఫర్ కిడ్నీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ కిడ్నీ డే కార్యక్రమాల్లో కిడ్నీ సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

మీడియా ఎక్సలెన్సీ అవార్డుల బహూకరణ

అవార్డు గ్రహీతలతో మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

రవీంద్రభారతి, మార్చి 13 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ప్రాజ్ఞిక ఫౌండేషన్, ప్రాజ్ఞిక ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో విశేష సేవలందిస్తున్న రిపోర్టర్లకు మీడియా ఎక్సలెన్సీ అవార్డు-2024 అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి విచ్చేసి ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లకు అవార్డులను బహూకరించారు. నిర్వాహకుడు ప్రవీణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజ్ఞిక ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రవీణ్, పారిజాత, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళ లకు వాటా దక్కడం లేదు

బంజారాహిల్స్, మార్చి 13 : విద్య, రాజకీయాల